## క్లుప్తంగా

### రోడ్ల నిర్మాణాలు ఆరునెలల్లో పూర్తిచేయాలి

**యడ్లపాడు:** రోడ్ల నిర్మాణ పనులను ఆరునెలల్లో పూర్తిచేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అధికారులకు ఆదేశించారు. ఆదివారం బోయపాలెం–చెంఘీజ్ ఖాన్‌పేట సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోయపాలెం–లింగారావుపాలెం రోడ్డు పనులకు అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. ఫిరంగిపురం నుంచి లింగారావుపాలెం రోడ్డు పనులపై సమీక్ష నిర్వహించి, వర్షాకాలం మొదలయ్యేలోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సృష్టికి మూలాధారం మహిళలు



**చిలకలూరిపేట:** సృష్టికి మూలాధారం మహిళలు అని, వారిని గౌరవించటం మన బాధ్యత అని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు ఆళ్ల వేమనరెడ్డి తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో రోటరీ కమ్యూనిటీ హాలులో శనివారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏడీఏ పి.మస్తానమ్మ, భూసర్వే అధికారి గేరా భాగ్యలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.అనురాధ, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ పి.సాహితీ, సెర్ప్ స్వచ్ఛంద సంస్థకు చెందిన ఎ.దివ్యజ్యోతిలను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, తోటకూర వెంకటనారాయణ, కందిమళ్ల అంజిబాబు, హరిదాసుల శ్రీనివాసరావు, పిన్నింటి రవిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు సన్మానం



**వినుకొండ:** గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక జాషువా కళ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత విభావరి నిర్వహించి కళాకారులను, మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో కళాపీఠం గౌరవ సలహాదారులు షకీలా, ప్రముఖ న్యాయవాదులు సైదారావు, సిద్దయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలో కళాకారులతో ర్యాలీ నిర్వహించారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**వినుకొండ:** పట్టణంలోని అంకాలమ్మ దేవాలయం ఆవరణలో మానవ సేవా సమితి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు పి.వి.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి చామర్తి భవాని శంకర్ మాట్లాడుతూ అన్ని మతాల దేవాలయాల దగ్గర మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మానవ సేవా సమితి ట్రెజరర్ వెంకట్రావు, సభ్యులు కరీముల్లా, లెక్చరర్ తిరుమల, జాబీర్, నాగార్జున, హరీష్, చంద్, అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



**నాదెండ్ల:** తెలుగు ఖ్యాతిని చాటిన మహనీయుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. గణపవరంలో దాతల సాయంతో నిర్మించిన నూతన ఆర్చ్, ఎన్టీఆర్ విగ్రహాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం కెల్లంపల్లి అచ్చియ్య అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మట్లాడుతూ ఎన్టీఆర్ కీర్తిని కొనియాడారు. అనంతరం బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి తోట రాజారమేష్, ధనలక్ష్మీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ చాపలమడుగు రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీరస్తు.. బడికి శుభమస్తు

- వినుకొండ నియోజకవర్గంలో ఆరు పాఠశాలల ఎంపిక
- ఒక్కో పాఠశాలకు రూ.ఐదు లక్షలు మంజూరు
- వసతుల కల్పన, పరికరాలు సమకూర్చాలని లక్ష్యం
- కేటాయించిన నిధులను ఖర్చుచేయాలని తల్లిదండ్రుల వినతి



వెల్లటూరు పాఠశాలలో ఆధునీకరించిన క్రీడా మైదానం

**బొల్లాపల్లి :** కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా పథకం పాఠశాలల ఆధునీకరణ, అభివృద్ధికి దోహదపడుతోంది. 2022–23 నుంచి 2026–27 వరకు ఐదేళ్లకు ఈ పథకం ద్వారా కేంద్రం రూ.ఐదు లక్షల నిధులు అందజేస్తుంది. ఈ నిధులతో పాఠశాలలో విద్యాప్రమాణాల మెరుగుకు వసతుల కల్పన, పరికరాలు సమకూర్చుకోవాలి. అయితే ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదని, పథకం అమలులో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పీఎం శ్రీ పథకానికి వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి, వినుకొండ రూరల్ మండలాల్లో వెల్లటూరు, నాగులవరం జెడ్పీహైస్కూల్స్, వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, అలాగే నూజెండ్ల, ఈపూరు, శావల్యాపురం మండల కేంద్రాల్లోని జెడ్పీ హైస్కూల్స్ ఎంపిక



పీఎం శ్రీ పథకానికి ఎంపికైన పాఠశాల

య్యాయి. ఈ పథకం ద్వారా వెల్లటూరు పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కేంద్రం అందజేసింది. అలాగే రూ.లక్షతో క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దారు. ఇంకా మరికొన్ని పరికరాలు, వసతులు సమకూర్చాల్సి ఉంది. పీఎం శ్రీ నిధుల వినియోగం



వెల్లటూరు పాఠశాలకు కేంద్రప్రభుత్వం అందజేసిన ఆర్వో వాటర్ యంత్రం

సమగ్రంగా జరగడం లేదని, కేటాయించిన నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని, దుర్వినియోగానికి ఆస్కారం లేకుండా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### నిధుల సద్వినియోగానికి కృషి

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, బడుల్లో ల్యాబ్‌ల ఆధునీకరణ, గ్రంథాలయం, క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం కల్పనకు కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తుంది. వీటితోపాటు దివ్యాంగ విద్యార్థులకూ అవసరమైన సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ఎంపికైన పాఠశాలల్లో నిధులు సద్వినియోగం అయ్యేలా చూస్తాం.

– సయ్యద్ జఫ్రుల్లా, ఎంఈవో –1

### 'పీఎం శ్రీ' ద్వారా రూ.2 లక్షలు అందాయి

పీఎంశ్రీ ద్వారా మా పాఠశాలకు ఇప్పటివరకు రూ.2 లక్షల నిధులు అందాయి. వీటితోపాటు మరో రూ.లక్ష కాంపోజిట్ గ్రాంట్ అందింది. రూ.లక్షతో వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రీడల కోసం క్రీడా స్థలం ఆధునీకరించాం. కాంపోజిట్ గ్రాంట్‌ను పాఠశాల మౌలిక వసతులకు వాడాం. వీటితోపాటు పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కోసం పీఎంశ్రీ ద్వారా ఆర్వో యంత్రం అందజేశారు. పాఠశాలలో పూర్తి స్థాయి వసతులు కల్పిస్తాం.

– షేక్ అలీసా, ప్రధానోపాధ్యాయులు, వెల్లటూరు

# ఆర్థిక క్రమశిక్షణతోనే అభివృద్ధి

యూబీఐ గుంటూరు రీజియన్ హెడ్ జవహర్

**యడ్లపాడు:** ఆర్థిక క్రమశిక్షణతోనే అభివృద్ధి సాధ్యమని యూనియన్ బ్యాంక్ గుంటూరు రీజియన్ హెడ్ డీజీఎం సయ్యద్ జవహర్ పేర్కొన్నారు. యడ్లపాడు మండలం బోయపాలెంలోని అనంత లక్ష్మి స్పిన్నింగ్ మిల్స్ 19వ వార్షికోత్సవం శనివారం రాత్రి సంస్థ ప్రాంగణంలో జరిగింది. మిల్లు మేనేజింగ్ డైరెక్టర్ సామినేని కోటేశ్వరరావు అధ్యక్షతన, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సామినేని ఫణికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జవహర్ హాజరై ప్రసంగించారు. ఉద్యోగుల సంక్షేమానికి అనంతలక్ష్మి నూలుమిల్లు కృషి చేయడం అభినందనీయమన్నారు. వివిధ క్రీడాపోటీల్లో విజేతలైన కార్మికులకు అతిథుల చేతుల మీదుగా నగదు, వస్త్రాలు పంపిణీ చేశారు.

**డాక్టర్ ప్రజ్ఞశ్రీకి సత్కారం**

అనంతరం ప్రసాద్ సీడ్స్ ఎండీ ప్రసాద్ సహాయంతో గుంటూరు మెడికల్ కాలేజీలో మెరిట్ సీటు



కార్యక్రమంలో మాట్లాడుతున్న యూబీఐ గుంటూరు రీజియన్ హెడ్ జవహర్

సాధించి వైద్య విద్యను పూర్తిచేసిన డాక్టర్ ప్రజ్ఞశ్రీని సన్మానించారు. ఆమె తల్లిదండ్రులను అభినందించి, విద్యార్థులందరూ డాక్టర్ ప్రజ్ఞశ్రీని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ ఎస్‌వీపీ షేక్ రియాజ్ అహమ్మద్, బ్యాంక్ ఏవీపీ పి.కోటేశ్వరరావు, యూబీఐ సీనియర్ మేనేజర్ రాజేంద్రకుమార్, యూబీఐ రిటైర్డ్ జీఎం కేఎల్ రాజు, రిటైర్డ్ సీనియర్ మేనేజర్ వెంకయ్య, గుంటూరు టెక్స్‌టైల్‌పార్కు ఎస్‌వీపీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

# సచివాలయ భవనం ప్రారంభం



కనపర్రులో సచివాలయ ప్రారంభ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు



కనపర్రులో సచివాలయ, ఆర్‌బీకేలకు స్థలం వితరణ చేసిన దాతలు పచ్చవ కోటేశ్వరరావు దంపతులు

**నాదెండ్ల:** గ్రామ సచివాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు చెప్పారు. నాదెండ్ల మండలం కనపర్రు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం, రైతు భరోసా కేంద్రానికి స్థలం దానం చేసిన మాజీ ఉపసర్పంచ్ పచ్చవ కోటేశ్వరరావు దంపతులను శాలువాలతో సత్కరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయి నూతన భవనాల్లో ప్రజలకు సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి రాఘవయ్య, సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# కాపు భవన్ నిర్మాణానికి శంకుస్థాపన

**నరసరావుపేట:** పట్టణంలోని సత్తెనపల్లి రోడ్‌లో శ్రీకృష్ణదేవరాయ కాపు భవన్‌కు భూమి పూజ ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆయన సతీమణి సుధా రాజేశ్వరి, జనసేన పార్టీ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ, దాసరి రాజా మాస్టర్ అతిథులుగా విచ్చేశారు. ఎమ్మెల్యే చదలవాడ తన సతీమణి సుధా రాజేశ్వరి అమూల్య నర్సింగ్ హోమ్ పేరుతో రూ.5 లక్షలు కాపు భవన్‌కు విరాళం ప్రకటించారు. అలాగే గుంటూరు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులైన డాక్టర్ పోకనాటి కృష్ణశ్రవంత్ డాక్టర్ అమూల్య పేరుపై మరో రూ.5 లక్షలు విరాళం ప్రకటించారు. కాపు సంఘ నాయకులు ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు దంపతులను సన్మానించారు. వచ్చే ఏడాదిలోపు కాపు భవన్ పూర్తిచేసే



కాపు భవన్ శంకుస్థాపన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ దంపతులు

బాధ్యత పూర్తిగా తీసుకుంటానని ఎమ్మెల్యే చదలవాడ కాపు సంఘ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాపు భవన్ అధ్యక్ష, కార్యదర్శులు పోతుల శంకర్, అల్లంశెట్టి మోహనరావు, రాయల శ్రీనివాసరావుతో పాటు పలువురు కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.

# పరిశోధనల వైపు మొగ్గు చూపాలి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

**నరసరావుపేట ఈస్ట్:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేటి సమాజానికి అవసరమైన వస్తు సేవల సముదాయాన్ని సృష్టించడంలో విద్యార్థులు కీలకపాత్ర వహించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన కళాశాల 20వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణ పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యా బోధనతోపాటు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణను మొదటి ఏడాది నుంచే అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. తమ విద్యార్థులు ఇన్ఫోసిస్, టీసీఎస్ తదితర కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, శివ రామచంద్ర ప్రసాద్, పాతూరు శ్రీనివాసరావు, శేషగిరిరావు, వీర రాఘవులు, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

### 13న వడ్డే రాజుల సంఘ కొత్త కార్యవర్గ ఎన్నిక

**వినుకొండ:** వడ్డే రాజుల సంఘ నియోజకవర్గ నూతన కార్యవర్గ ఎన్నిక ఈ నెల 13న స్థానిక నరసరావుపేట రోడ్డులోని వడ్డే ఓబన్న విగ్రహం వద్ద గల కేజీఎన్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు నాయకులు వేముల శ్రీనివాసరావు, చల్లా కుమార్ తెలిపారు. పట్టణంలోని మిర్చి యార్డులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉండే వడ్డే రాజుల నాయకులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పల్లపు వెంకటేశ్వర్లు, తన్నీరు ఆంజనేయులు, పల్లపు పున్నయ్య, ఈర్ల పిచ్చయ్య, దేవళ్ల ఎరుకలయ్య, కొమ్మర సాంబశివరావు, తమ్మిశెట్టి బాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### అభయాంజనేయ స్వామి తిరునాళ్ల



**రొంపిచర్ల :** గోగులపాడులోని సువర్చల సమేత అభయాంజనేయ స్వామి ఆలయ 31వ వార్షిక తిరునాళ్ళ ఆదివారం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష, సహస్రనామ పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్ళు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం జరిగింది. రాత్రి వేళల్లో భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

### రేపు బోటిమీద ప్రసన్నాంజనేయుని తిరునాళ్ల



**ఈపూరు(శావల్యాపురం):** ఈపూరులోని బోటి మీది ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు, దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. 55 ఏళ్ల నుంచి ఇక్కడ తిరునాళ్ల జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే ఆలయాన్ని ముస్తాబు చేశారు.

### నేటి నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్స్

**రొంపిచర్ల :** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)' కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ బి.నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తామని వివరించారు.

### గ్రీవెన్స్‌కు అధికారులంతా హాజరు కావాలి

**నాదెండ్ల:** తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మండల పరిషత్, ఆరోగ్య, వ్యవసాయ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్‌ఎస్‌పీ, పశుసంవర్ధక, పోలీస్ తదితర శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ సర్వేయర్లు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు సోమవారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

### నేడు అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట

**నాదెండ్ల:** జాతీయ రహదారి గణపవరం వద్ద సోమవారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అభయాంజనేయస్వామి విగ్రహాన్ని కోటప్పకొండ నుంచి ఆదివారం సంప్రదాయబద్ధంగా మేళతాళాలతో గ్రామానికి తరలించారు. ప్రతిష్ఠ అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేయనున్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

**రెంటచింతల:** స్థానిక శివాలయం కల్యాణ మండపంలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చల్లగుండ్ల ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి శుక్లముల వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించినట్లు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ తెలిపారు. డాక్టర్ బండారు చిరంజీవి ప్రారంభించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 184 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 66 మందికి కంటి శుక్లముల శస్త్ర చికిత్స నిమిత్తం పెదకాకాని శంకర్ కంటి ఆస్పత్రికి రిఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గుండా జనార్దన్‌రావు, నాళం పెదబాబు, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, యేచూరి వెంకట సైదయ్య, గూడూరి జానకిరామ్, ఇన్‌ఛార్జి సైదులు, రాంబాబు, పారామెడికల్ సిబ్బంది, వాగ్దేవి కళాశాల విద్యార్థులు సేవలు అందచేశారు.

### ఏఎంరెడ్డి కళాశాలలో మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న మహిళా అధ్యాపకులు

**నరసరావుపేట రూరల్:** ఏఎంరెడ్డి విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళా అధ్యాపకులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రూప్ కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జునరావు, డాక్టర్ పి.భార్గవ్‌భూషణ్‌రావు, డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అకడమిక్ డీన్ కిషోర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీసురేఖ తదితరులు పాల్గొన్నారు.

# మెగా ఉచిత వైద్యశిబిరానికి స్పందన

**యడ్లపాడు:** ఉచిత వైద్యశిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. స్థానిక నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో పుటిగంపు సరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రారంభించారు. విజయవాడ హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్, గుంటూరు హెల్త్ కేర్ హాస్పిటల్, శ్రీకృష్ణ శ్రీ మెడికల్ ఆర్గనైజేషన్ సహకారంతో ఏర్పాటైన ఈ శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ ఫారుక్‌ఖాన్, డాక్టర్ వినోద్ ఆధ్వర్యంలో 250 మంది రోగులకు రూ.ఐదువేల విలువైన క్యాన్సర్ స్క్రీనింగ్ (పాప్ స్మియర్, పీఎస్ఏ, సీఏ–125), గుండె సంబంధిత ఈసీజీ, 2డీ, ఎకో, బీపీ, షుగర్, వంటి కీలక పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన



రోగిని పరీక్షలు చేస్తున్న కార్డియాలజిస్ట్ డాక్టర్ ఫారుఖ్‌ఖాన్

వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ పుటిగంపు వెంకటేశ్వరరావు, ఆయా హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# పేద బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

**వినుకొండ:** బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జీవీ మాధవరావు ఆధ్వర్యంలో విద్యానగర్ 4వ లైన్‌లోని చింతలచెర్వు రఘు నివాసంలో ఐదు పేద కుటుంబాలకు బియ్యం నూతన వస్త్రాల బహూకరణ జరిగింది. ప్రతినెలా చింతలచెర్వు రాఘవేంద్రరావు, గాదె రాధిక, బెంగుళూరు వాస్తవ్యులు బొగ్గరం మార్కెండేయ శర్మ, శేషమ్మ, మూడు కుటుంబాలకు ఒక బాలుడు తన పాకెట్‌మనీని సహాయంగా అందించాడు. కార్యక్రమంలో సి.హెచ్. భద్రయ్య, ఎం.వి.శర్మ, పి.నారాయణరావు, భువనగిరి సుబ్రహ్మణ్యం, భాగవతుల రవి



సరుకులుఅందజేస్తున్న సమితి నాయకులు

కుమార్, అప్పరాజు నాగేశ్వరరావు, గాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు కోసం గ్రామస్తుల ఆందోళన

**దాచేపల్లి :** రోడ్డు బాగు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు మళ్లీ రోడ్డెక్కారు. దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. రెండు గంటల పాటు రోడ్డుకి అడ్డుగా వాహనాలు, రాళ్లు పెట్టి నిరసన వ్యక్తం చేయడంతో భారీగా వాహనాలు నిలిచాయి. దాచేపల్లి–తంగెడ గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డులో భారీగా గుంతలు ఏర్పడటంతో ఇటీవల తవ్వారు. రెండు నెలల క్రితం రోడ్డు నిర్మాణం కోసం చర్యలు చేపట్టి నిలిపివేశారు. భారీ వాహనాల రాకపోకలతో దుమ్మూధూళితో ప్రజలు అల్లాడిపోతున్నారు. నాలుగు రోజుల క్రితం కూడా గ్రామస్తులు రోడ్డెక్కి ఆందోళన చేయగా పోలీసులు సర్ది చెప్పారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ సమస్యను స్థానిక శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు.



రోడ్డుపై ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

ఆందోళనకారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుమ్మూధూళి లేవకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లు చల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆందోళన కారణంగా వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

### బస్ షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ

**రెంటచింతల:** యర్రబోతుల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులు బస్ షెల్టర్ నిర్మించడం అభినందనీయమని ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం బస్ షెల్టర్ నిర్మాణానికి వారు భూమి పూజా చేశారు. వివిధ ప్రాంతాలకు బస్ ప్రయాణం చేయు ప్రజలకు ఈ ప్రాంతంలో షెల్టర్ ఏర్పాటు చేయడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, గుండా నరసింహారావు, గుండా రామ్మూర్తి, యేచూరి కాశీపతి, నాళం పెదబాబు, యేచూరి వెంకట సైదయ్య, సైదులు పాల్గొన్నారు.